## క్లుప్తంగా

### గ్రామాల్లో పార్టీ జెండాల తొలగింపు



**అమరచింత:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో ఉన్న ఆయా రాజకీయ పార్టీల జెండాలతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కప్పడం జరిగిందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. అమరచింత మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా రహదారి వెంట ఉన్న పార్టీలకు చెందిన జెండాలతో పాటు బ్యానర్లను తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్‌లను చెరిపేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నియమావళిని ఎవరైన అతిక్రమిస్తే వారిపై చట్టరీత్య చర్యలు తప్పవన్నారు.

**వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న జీపీ సిబ్బంది**

**వీపనగండ్ల:** స్థానిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బ్యానర్లు, వాల్‌పోస్టర్లను పంచాయతీ అధికారులు తొలగించారు. నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి పోస్టర్లు అంటించరాదని, వివిధ గ్రామాలలోని పంచాయతీ అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు.

### ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**వనపర్తి రూరల్:** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆసరా, దివ్యాంగుల పింఛన్లను పెంచాలని మండల ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల అందించే పింఛన్లను వెంటనే పెంచాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, గువ్వలమధు, రవి, చంద్రశేఖర్, లక్ష్మణ్, భాస్కర్, పెంటయ్య, వెంకటయ్య, గుంటిపెంటయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

### మండల వ్యవసాయ అధికారిగా రమేష్

**గోపాల్‌పేట:** ఏదుల మండల వ్యవసాయాధికారిగా మంగళవారం భాషమౌని రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏఈఓగా పని చేశానని పదోన్నతిపై మంగళవారం ఏదుల మండల ఏఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

### వ్యక్తికి రిమాండ్

**గోపాల్‌పేట:** చోరీలకు పాల్పడిన నిందితుడిని పట్టుకుని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ నరేష్‌కుమార్‌తో కలిసి విలేకర్లకు వివరాలు తెలిపారు. గోపాల్‌పేట మండలంలో ఇటీవల పాటిగడ్డతండా, బుద్దారంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి బుద్దారం గ్రామానికి చెందిన ఆవుల అశోక్‌ను పట్టుకుని ఒక వీఓ సెల్‌ఫోన్, వెండి గొలుసులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దొంగతనాలకు పాల్పడేవారు ఎక్కడ ఉన్నా పట్టుకుని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పోటోరైటప్‌: 30డబ్ల్యుఎన్‌పి201: గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ, ఎస్సై నరేష్‌కుమార్

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**అమరచింత:** అమాయకులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు అధికమవుతున్నాయని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ స్వాతి కోరారు. మండలంలోని నందిమల్ల గ్రామంలో మంగళవారం సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లకు అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చిన ఫోన్లకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వచ్చిన ఫేక్ మెసేజ్‌లను ఓపెన్ చేసుకోవద్దని సూచించారు. పండుగల సమయంలో ఇంటిల్లిపాది సొంతూర్లకు వెళ్లేటప్పుడు పక్కింటి వారికి గాని, పోలీసులకు గాని సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ షురూ

- గ్రామాలకు చేరిన పాలనాధికారులు
- కీలకం కానున్న జీపీఓలు



పాన్‌గల్‌లో భూ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్న రైతులు(ఫైల్)

**పాన్‌గల్:** గ్రామ పరిపాలనాధికారుల(జీపీఓ)ను ఆయా మండలాలకు కేటాయించగా, ఇటీవల బాధ్యతలు చేపట్టారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఎదురయ్యే సమస్యలు ఇక నుంచి వీరే పరిష్కరించనున్నారు. భూ సమస్యలపై ఇప్పటికే ఆయా మండలాల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు ఉన్నాయి. గ్రామ రెవెన్యూ అధికారుల నియామకంతో గ్రామ స్థాయిలో ప్రజలకు రెవెన్యూ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలుగా విధులు నిర్వహించిన వారికి అర్హత పరీక్ష నిర్వహించి జీపీఓలుగా ఎంపిక చేశారు.

**రెవెన్యూ గ్రామాలను కుదించి..**

గత ప్రభుత్వం వీఆర్వో, వీఆర్‌ఏల వ్యవస్థను రద్దు చేసి వారిని వేర్వేరు శాఖల్లో నియమించింది. ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ శాఖల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రహించి జీపీఓ వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టింది. గతంలో రెవెన్యూ గ్రామాలుండగా వాటిని క్లస్టర్లుగా విభజించారు. రెండు, మూడు రెవెన్యూ గ్రామాలను కలిపి ఓ క్లస్టర్‌గా చేశారు. అక్కడ జీపీఓ బాధ్యతలు చూస్తారు. మండలంలో సాదాబైనమా దరఖాస్తులు అధికంగానే ఉన్నాయి. రెవెన్యూ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతుల సమస్యలుంటే వాటి పరిష్కారం కోసం క్లస్టర్ గ్రామానికి వెళ్లి సమస్యలను పరిష్కరించుకోవాల్సిందే. ప్రస్తుతం మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ గ్రామాలను 10 క్లస్టర్లుగా విభజించి వాటికి జీపీఓలను నియమించారు. మండలానికి 10 క్లస్టర్లకు 8 మంది జీఓలను నియమించగా, మిగతా రెండు క్లస్టర్లకు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.

**మండలాల వారీగా జీపీల నియామకాలు**

| మండలం | క్లస్టర్లు | జీపీఓల నియమాకం |
|---|---|---|
| పాన్‌గల్ | 10 | 8 |
| చిన్నంబావి | 7 | 4 |
| వీపనగండ్ల | 7 | 3 |

**గ్రామ స్థాయిలో జీపీఓలు కీలకం..**

జీపీఓలు గ్రామ స్థాయిలో కీలకంగా మారనున్నారు. భూ భారతి, రైతాంగ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రజలకు అండగా నిలవడం, తదితర విధులు కేటాయించారు. ఎన్నికల సమయంలో బీఎల్‌ఓలుగా వ్యవహరించనున్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉంటాం**



మాకు కేటాయించిన గ్రామంలో ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో నిర్వహించిన విధులను తిరిగి నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మాకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– నాగయ్య, జీపీఓ, మాందాపూర్, పాన్‌గల్

**ఇబ్బందులు తొలుగుతాయి**



మండలానికి నూతనంగా వచ్చిన జీపీఓలతో కొంత రెవెన్యూ ఇబ్బందులు తొలుగుతాయి. గ్రామాల్లో రెవెన్యూకు సంబంధించిన ఏ అధికారి లేకపోవడంతో గతంలో ప్రతి పనికి మండల తహసీల్దార్‌కు కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రా మాలకు జీపీఓలను నియమించడంతో ఆ సమస్యలు తొలుగుతాయి. ప్రస్తుతం రెవెన్యూ గ్రామాలను కలిపి క్లస్టర్లు ఏర్పాటు చేసి వారికి కేటాయించిన జీపీఓలు వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

**మండలానికి 8 మంది కేటాయింపు**



మండలానికి నూతనంగా 8 మంది జీపీఓలను కేటాయించారు. మండలంలో మొత్తం 10 క్లస్టర్లకు 8 మంది జీపీఓలను కేటాయించారు. వా రికి క్లస్టర్ గ్రామాలను కేటాయించా రు. మిగిలిన రెండు క్లస్టర్ గ్రామాలకు కార్యాలయంలోని ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను నియమించాం. వారికి కేటాయించిన గ్రామాల్లో వారు అందుబాటులో ఉంటారు. వారి నియామకంతో గ్రామాల్లో కొన్ని సమస్యలకు ఇబ్బందులు తొ లుగుతాయి.

– సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్, పాన్‌గల్

# దుర్గామాత పాహిమాం..



ఆత్మకూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కేశవనగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

**సాక్షి, నెట్‌వర్క్:** దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల్లో, ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వనపర్తి మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివకుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- వనపర్తి జిల్లా కేంద్రంలోని రామాలయం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, అయ్యప్ప, చౌడేశ్వరి దేవాలయంలోని అమ్మవారిని దుర్గాదేవి రూపంలో పూజించారు. సామూహికంగా పుష్పాలతో కుంకుమార్చన నిర్వహించారు.
- ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరస్వామి, కేశవ స్వామి ఆలయాల్లో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయంలో, వాల్మీకినగర్‌లో, బీసీకాలనీలో, మండలంలోని ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి గ్రామాల్లో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రతిరోజు బతుకమ్మ పూజలు, బొడ్డెమ్మలు, సహస్ర కుంకుమార్చన, హోమం, అన్నదానం నిర్వహిస్తున్నారు.
- కొత్తకోటలో పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, అంబాభవాని దేవాలయంలో దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు.
- అమరచింత పట్టణంలోని శ్రీకృష్ణనగర్, విగ్నేశ్వర భవానీ నగర్‌లో దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. జమ్ములమ్మ ఆలయం, శివ చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.
- వనపర్తి మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివకుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- మదనాపురం మండలంలోని కొత్తపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాతకు మహిళలు కుంకుమార్చన చేశారు. మదనాపురం, దుప్పల్లిలో దుర్గామాతకు పూజలు చేశారు.
- వీపనగండ్ల మండలంలోని తూంకుంట గ్రామ సమీపంలో వెలిసిన ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించారు. సంపత్‌రావుపల్లి, తూంకుంట, సంగినేనిపల్లి గ్రామాల నుంచి పలువురు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

- ఖిల్లాఘనపురం పర్వతాపురం, మామిడిమాడ, మానాజీపేట, ఉప్పరిపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారి మండపాల దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు.

### దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి



**వనపర్తి విద్యావిభాగం:** జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులోని నెహ్రూ కమ్యూనిటీ హాల్లో సింహసేన ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ సింహసేన ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా దుర్గామాత నవరాత్రులు విజయవంతంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. మాజీ మంత్రి వెంట నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్స్ నందిమల్ల శారద, కంచ రవి, చిట్యాల రాము, చంద్రశేఖర్, అంజి యాదవ్, కానాయపల్లి చంద్రమ్మ, లక్ష్మన్న, సత్యం, సింహసేనా యువత కె.రవి, శ్రీధర్, కార్తీక్, శ్రీకర్, శేఖర్ ఉన్నారు.

### గ్రూఫ్‌-1విజేతకు సన్మానం

**పాన్‌గల్:** మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమారి సుజాత గ్రూఫ్‌-1లో ప్రతిభ చూపి డీఎస్పీ ఉద్యోగం సాధించడంతో ఆమెను అభినందిస్తూ వాల్మీకి బోయ ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ జిల్లా చైర్మన్ ఉమ్మళ్ల రాములు, వైస్ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడారు. డీఎస్పీ ఉద్యోగం సాధించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారని, యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకొని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్యనాయుడు, దేవేందర్‌నాయుడు, శేషయ్య, శివలింగం, రాఘవేంద్ర, సంపత్, తదితరులు పాల్గొన్నారు.


**అమరచింత:** పట్టణానికి చెందిన దీనకుమార్ కూతురు మాధురి నీట్ ఫలితాల్లో సత్తచాటి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. రంగారెడ్డి జిల్లా మెడిసిటీ కాలేజ్‌లో సీటు వచ్చిందని తండ్రి దీనకుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన మాధురి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం హర్షణీయమని పలువురు అభినందించారు.

### చిన్నారులకు వైద్య శిబిరం



**పాన్‌గల్:** మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు డా.చంద్రశేఖర్ తెలిపారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.అనిల్ ఆధ్వర్యంలో 76 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైద్య సేవల్లో నిర్లక్ష్యం వీడాలి



**వీపనగండ్ల:** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి అందుతున్న వైద్య సేవలపై ప్రజలకు వివరించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలు, నెలవారి నివేదికల సమీక్ష పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొనాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కళమ్మ, రాఘవేందర్, పలువురు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ముగిసిన భజన పోటీలు

**చిన్నచింతకుంట:** దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ను పురస్కరించుకొని కురుమూర్తిలోని వీరాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో దుర్గా మాత మండపం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి భజన పోటీ లు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలో కొంద ర్గు భజన మండలి మొదటి విజేత, గంగాపురం భజన మండలి రెండో విజేత, దుప్పల్లి భజన మండలి మూడో విజేత, చిన్నకడుమూర్ భజమండలి నాలుగో విజేతగా నిలిచారు.

# పెద్దవాగుకు పోటెత్తిన వరద



పాన్నకల్, నందిపేట మధ్యన అలుగు నీళ్ల ఉధృతి

**అడ్డాకుల:** మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు మంగళవారం ఉదయం నుంచి భారీ వరద పోటెత్తింది. సోమవారం రాత్రి ఎగువ ప్రాంతంలో వర్షం కురవడంతో వాగుకు వరద పెరిగింది. రెండు మండలాల్లోని వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుగా ప్రవహిస్తున్నాయి. సుమారు నెల రోజులుగా వాగులో వరద నీళ్లు పారుతున్నాయి. రెండు మండలాల్లోని వాగులో ప్రవహిస్తున్న వరద నీళ్లు దిగువన్న ఉన్న వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మపేట వద్ద ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ఇప్పటికే సరళాసాగర్ నిండుకుని సైఫన్లు తెరుచుకున్నాయి.

**నిలిచిన రాకపోకలు**

మండలంలోని పొన్నకల్ నల్ల చెరువు అలుగు పారుతుండడంతో నందిపేట, పొన్నకల్ మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. నల్ల చెరువు నీళ్లు చెరువు కట్ట వద్ద బీటీరోడ్డుపై పెద్ద ఎత్తున పారుతున్నాయి. రెండు, మూడు రోజులుగా తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుండగా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వరద పెరిగి మంగళవారం రాకపోకలు పూర్తిగా నిలిచాయి. నందిపేట గ్రామస్తులు దాసర్‌పల్లి, మూసాపేట మీదుగా హైవేకు చేరుకుంటున్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



స్థానిక ఎన్నికలపై వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి:** ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో అతిక్రమణలకు చోటు ఇవ్వకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, ఎస్పీ గిరిధర్‌రావులతో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణ పలు అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో అతిక్రమణలకు చోటు ఇవ్వకుండా, ప్రశాంత వాతావరణలో ఎన్నికలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను అందరూ విధిగా పాటించాలని, అలా పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలకు లోబడి ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లకు సంబంధించి పోలీసు శాఖ వద్ద అనుమతి తీసుకోవాలని, నిర్దేశించిన సమయం తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్ స్పీకర్లను వినియోగించొద్దని సూచించారు. మతపరమైన ప్రదేశంలో గానీ, పోలింగ్ కేంద్రాల వద్ద గాని, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. సోషల్ మీడియాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా పోస్టులు పెట్టడం నిషేధమన్నారు. ఈ అంశాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ కార్యకర్తలకు తెలియజేసి ఎన్నికలు సజావుగా నిర్వహించుకునే విధంగా సహకరించాలన్నారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలీస్ విధులకు ఆటంకం కలిగించకుండా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా అందరూ సహకరించాలన్నారు. పోలీసులు ఎన్నికల విధుల్లో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పనిచేస్తారని, పోలీసు విధులకు ఆటంకం కలిగించకుండా సంయమనం పాటించాలన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో పూర్తిస్థాయిలో శాంతిభద్రతలను కాపాడి ఒక్క కేసు కూడా నమోదు కాకుండా సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఖిల్లాఘనపురం:** చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఖిల్లాఘనపురం మండలం మానాజీపేట గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు, మణెమ్మల కూతురు గడ్డం దివ్య ఈ నెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, నవంబర్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైంది. రెడ్డిగూడెం సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెను మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి శాలువాతో సన్మానించారు. జాతీయస్థాయి క్రీడల్లో రాణించి తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుక రావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ విశ్రాంత పీఈటీ గోపాలం, వనపర్తి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి రాంచంద్రమ్మ స్కూల్‌గేమ్స్ ప్రధాన కార్యదర్శి కుమార్, మన్యం, కురుమయ్య, మధు, గోపాలం పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక ప్రగతికి పునాదులు వేస్తాం



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొట్టం వంశీధర్‌రెడ్డి

**కొత్తకోట రూరల్:** రైతుల ఆర్థిక ప్రగతికి పీఏసీఎస్ పనిచేస్తుందని పీఏసీఎస్ అధ్యక్షుడు కొట్టం వంశీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సింగల్‌విండో కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్, విండో అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి కోసం సింగల్‌విండోలు పునాదులు వేస్తున్నాయన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి దిశగా సంస్థలు పనిచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రస్తుతం సంఘంలో 6057 మంది సభ్యులు ఉన్నారని, ఇప్పటి వరకు 967 మంది రైతులకు రూ.5.94 కోట్లు వ్యవసాయ రుణాలు అందించామన్నారు. 41 మందికి రూ.40 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 'కర్షక మిత్ర' పథకం ద్వారా ఏడాదికి రూ.1.42 కోట్లు దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేశామన్నారు. వ్యాపారరంగంలో కూడా సహకరించడం జరుగుతోందని, ఇప్పటివరకు 193 మందికి రూ.2.50 కోట్లు వ్యాపార రుణాలు, 81 మందికి రూ.97 లక్షలు బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది విండోకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్ మంజూరైందన్నారు.. సంఘం సభ్యుల మూలధనం వాట ప్రస్తుతం రూ.1.31 కోట్లు ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సీఈఓ బాలరాజు చారి, డైరెక్టర్లు, సిబ్బంది, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి



బొల్లారంలో ఘనంగా జరుగుతున్న సంస్కృతిక కార్యక్రమాలు

**వీపనగండ్ల:** సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని సీపీఎం జిల్లా నాయకులు ఎండీ జబ్బార్, సీపీఎం సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బొల్లారం గ్రామంలో నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో వారు ప్రసంగించారు. గ్రామంలో మహిళా సంఘం సభ్యులకు, యువకులకు బొడ్డెమ్మలు, కోలాటాలు, భరతనాట్యం, పద్యాలు, ఏకపాత్రాభినయం, కళానృత్యాల పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారులు బండి యాదగిరి, నాగిరెడ్డి, ఎం కృష్ణయ్య, బాలగౌడ్, వెంకటస్వామి, శివ, కుర్మయ్య, నాగరాజు, మౌలాలి, ఆశన్న, శేఖర్‌రెడ్డి, రాణి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

# వంతెనపై రాకపోకలకు ఆటంకం



మదనాపురం వద్ద అతి తక్కువ నీరు పారుతున్న రాకపోకలు నిలిచిపోయాయి

**మదనాపురం:** సరళాసాగర్ శంకరసముద్రం వరదతో మునిగిన వంతెన నీరు తగ్గినా అధికారులు స్పందించకపోవడంతో రాకపోకలు స్తంభించాయి. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ వంతెన ద్వారా మదనాపురం, కొత్తకోట, వనపర్తి, చిన్నచింతకుంట, ఆత్మకూరు, అమరచింత వంటి మండలాలకు అనుసంధానం ఉంది. వంతెన మూతపడటం ప్రజల నిత్యజీవితంపై గణనీయ ప్రభావం చూపిస్తోంది. వర్షాల కారణంగా వాగులో ప్రవాహం పెరిగినప్పుడు, వంతెన కింద ఉన్న పైపుల్లో మట్టి, చెత్త, చెదారం చేరి వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి పైపులను శుభ్రం చేసి ఉంటే ఈ స్థితి ఉండేది కాదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# అండర్ బ్రిడ్జిలో నడిచేదెలా..?



**అడ్డాకుల:** మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జిలో వర్షం నీళ్లు నిలుస్తున్నాయి. దీనివల్ల అండర్ బ్రిడ్జిలో రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం మొదలైన నాటినుంచి ఇదే పరిస్థితి నెలకొంది. అండర్ బ్రిడ్జిలో నిలిచే నీళ్లు ముందుకు వెళ్లే కాల్వ ఎత్తులో ఉండడంతో నీళ్లు నిలుస్తున్నాయి. వృద్ధు లు, చిన్నపిల్లలు బ్రిడ్జిలోంచి నడిచి వెళ్లడానికి ఇ బ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి అండర్ బ్రిడ్జిలో నీళ్లు ని లువకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.